# పరిష్కారం

డి.ఆర్.ఇంద్ర

మీ పాప డాక్టర్‌కావాలా? మీ బాబు గొప్ప ఇంజనీర్ అవాలా? అయితే నేడే మీ చిన్నారుల్ని మా నవోదయా కాన్వెంట్‌లో చేర్చండి. రేపటి పౌరులకు నేటినుండే అత్యుత్తమ శిక్షణనిచ్చే ఏకైక ఆదర్శవిద్యాలయం - నవోదయా కాన్వెంట్!

మరోసారి పాంప్లెట్ చదివింది రూప. టింకుకి ఎడ్మిషన్ కోసం ఇప్పటికి డజను కాన్వెంట్లకి తిరిగి నిరాశతో వెనుదిరిగివచ్చింది. కాన్వెంట్స్‌లో సీట్లు లేకా కాదు, పిల్లల్ని కన్నందుకు వేసే పెనాల్టీలా వాళ్ళు డిమాండ్‌చేసే గుండెలదిరే ఫీజు కట్టలేకా కాదు. హైదరాబాదు మహానగరంలో టింకుకి ఎల్ కెజిలో సీటు దొరకకపోవడానికి కారణం వింటే అందరూ నవ్వుతారు. కాని తనకి ఆకారణం జీవన్మరణ సమస్యలా తయారైంది.

నిన్న ఉషోదయా కాన్వెంట్‌లో హెడ్మిస్ట్రెస్‌కీ తనకీ మధ్య జరిగిన ఘర్షణ గుర్తుకువచ్చింది. ఎంత మరచిపోదామనుకున్నా వెళ్ళిన ప్రతీ కాన్వెంట్‌లోనూ తనకి అదే అవమానం! చిన్న చూపు! తననో వింత జంతువులా ఆశ్చర్యంగా చూడటం! తనని సాదరంగా ఆహ్వానించి కూర్చొబెట్టి అప్లికేషన్ ఇచ్చి టింకూని ఇంటర్వ్యూ చేసి ఎంతో ముచ్చట పడిన హెడ్మిస్ట్రెస్ పూర్తి చేసి ఇచ్చిన అప్లికేషన్ చూసి నుదురు చిట్లించింది.

"ఫాదర్స్ నేమ్ అనే కాలమ్‌లో నీపేరు వ్రాసావేమిటమ్మా?" అప్పటిదాకా ఎంతో మర్యాదగా మాట్లాడిన ఆవిడగొంతులో- 'ఇంత అనెడ్యుకేటెడ్‌వా!' అన్న తేలిక భావం కొట్టొచ్చినట్టు కనబడింది.

"మేం కలిసి ఉండటం లేదు మాడమ్" తను చాలా మామూలుగానే చెప్పింది.

"సో వాట్? మీరు లీగల్‌గా డైవోర్సు తీసుకున్నారా?"

"లేదు. మేం కల్సి జీవించడం సాధ్యం కాక విడిగా ఉంటున్నాం. బాబు నాదగ్గరే ఉంటాడు. అందుకే నాపేరు వ్రాసాను."

"అది మీ వ్యక్తిగతం. కానీ ఫాదర్ ఉండగా తల్లిపేరు వ్రాయకూడదు. తండ్రి మరణించినపుడు కానీ లేక చట్టప్రకారం విడిపోయినపుడు కానీ మాత్రమే గార్డియన్‌గా తల్లిపేరు వ్రాయవచ్చు. మీకు ఆమాత్రం తెలిసే ఉండాలే!" ఆవిడ గొంతులో వ్యంగ్యం తనని ఉడికించింది.

"జరుగుతున్నది అదే కావచ్చు. కానీ కుర్రవాడి ప్రస్తుత జీవితంతో ఏమీ సంబంధం



"సారీ, మీతో రావడానికీ కాపురం చెయ్యడానికీ నేను సిద్ధంగా లేను. మీ ఇష్టం లేనపుడు దూరంగా వుండి, మీ కోప తాపాలు తగ్గాక దగ్గరగా రావడానికి నేనేమీ మీ పెట్‌డాగ్‌ని కాదు. ఏమీలేనిదానికి ఇంత జరిగాక ఏమీ జరగనట్లే నేను ఆత్మవంచన చేసుకుని మీతో కాపురం చేయడం జరగని పని - పూర్వ ప్రేమాయణాలు ఏమీలేని మరో స్త్రీ నెవరినైనా మీరు వివాహం చేసుకొదలిస్తే నిరభ్యంతరంగా చెసుకొవచ్చు" అని స్థిరంగా మెల్లిగా చెప్పినా బాంబు బద్దలవ్వనే అయింది.

లేని వ్యక్తి పేరే వ్రాసి తీరాలనడం ఏరకంగా న్యాయం? వాడికి తల్లయినా, తండ్రైనా నేనే, ఇక్కడ నా ఎక్స్ హజ్బెండ్ పేరుదేనికి? తను ఎంత నిగ్రహంగా ఉండాలను కున్నా, త్రొక్కిపట్టిన బాధ, కోపం ఎగతన్నుకువచ్చి తన కంఠమూ మారింది.

"సారీ- అప్లికేషన్‌లోని నియమాలకి విరుద్ధంగా మీ అబ్బాయికి సీటు ఇవ్వలేను..... నెక్స్ట్" అంటూ వేచిఉన్న మరో పేరెంట్ కోసం కాలింగ్‌బెల్ నొక్కింది - ఇంక గెటవుట్ అన్నట్టుగా.

ఇటువంటి అనుభవాలతో అప్పటికే విసిగెత్తిపోయి ఉన్న తను ఇంక కంట్రోల్ చేసుకోలేక ఒక్కసారి బరస్ట్అయింది.

"భార్యాబిడ్డలతో సంబంధం అక్కరలేదనుకుని బాధ్యతా రాహిత్యంగా వెళ్ళిపోయిన మనిషిపేరు మీకుదేనికి? కుర్రవాడ్ని స్కూల్లో చేర్పించడానికి వచ్చింది నేను- జన్మనిచ్చిన తల్లిని! కుర్రవాడు బ్రతికేది నావల్ల. తల్లిపేరు వ్రాయడానికి నిరాకరించి, మానవత్వపు బాధ్యతల్ని వదులుకు వెళ్ళిన మగవాడి పేరే వ్రాయాలని నిర్బంధించే మీ ఆదర్శ విద్యాలయాలు ఏ ఉత్తమపౌరుల్ని సృష్టిస్తాయి? ఎవరి జీవితాలకి ఉషోదయాల్ని తెస్తాయి మీ కాన్వెంట్లు? పెరిగిన తన కంఠధ్వనికి, తనమాటల వాడికి ప్రక్కరూంలో ఉన్న గుమస్తాలు, బయట వెయిట్ చేస్తోన్న తల్లిదండ్రులూ తొంగి చూడటంతో హెడ్మిస్ట్రెస్ ముఖం జేవురించింది.

"నా కాన్వెంట్, నా ఇష్టం! తండ్రెవరో తెలియని అడ్డమైన కుర్రాళ్ళనీ చేర్చుకోడానికి ఇదేమీ అనాధశరణాలయం......" వెళ్ళబోతూ రివ్వున వెనుదిరిగి చూచిన తన కళ్ళలోని ఎరుపుని చూసి హెడ్మిస్ట్రెస్ తగ్గి గొణుక్కుంటూ కాలింగ్‌బెల్ నొక్కింది.

టింకు చెయ్యిపట్టుకుని వికలమైన మనసుతో బయట పడింది. హెడ్మిస్ట్రెస్ ఎంత అసహ్యంగా మాట్లాడింది! ఆవిడకు తన తల్లి వయసు ఉంటుంది. వయసు పెద్దరికాన్ని తేలేదనడానికి ఆవిడ నిదర్శనంలా ఉంది. విద్యపేరుతో తల్లిదండ్రుల్నీ, చిన్నపిల్లల్నీ దారుణంగా దోచుకోవడం, మోసగించడమే కాక, ఏ ఆదర్శాలకీ నీతినియమాలకీ కట్టుబడక డబ్బుని పిండే ఇటువంటి కాన్వెంట్లు సమాజాన్ని ఎంత భ్రష్టు పట్టిస్తున్నాయో! సమాజ సంస్కరణకి అత్యంత ముఖ్యమైన విద్యే వ్యాపారవస్తువైతే ఆ సమాజానికి పతనమే తప్ప మరే భవిష్యత్తు ఉంటుంది?

తను వారం రోజులుగా ఆఫీసుకి శెలవు పెట్టి అడుగుపెట్టని కాన్వెంటు లేదు. "ఇంత చిన్న విషయానికే నీకెందుకింత పట్టుదల? తండ్రిపేరు శేఖర్ అని వ్రాస్తే ఏం?" అంటుంది తన ఫ్రెండ్ జయ.

ఇది చిన్న విషయమా? అందరికీ అది చిన్న విషయంలా కనిపించవచ్చు. కానీ తనకి మాత్రం అలా అనిపించడంలేదు. తల్లి తను బ్రతికే ఉండగా తనతో సంబంధం తెంపుకున్న శేఖర్‌కొడుకుగా టింకు గుర్తించబడాలా! విద్యాచట్టాలు కూడా అలాగే చెపుతున్నాయా! చట్టాల్ని తయారు చేసే వాళ్ళకి ఈహక్కు ఎవరు ఇచ్చారు?

తను చిన్నపుడు చదివిన సత్యకామ జాబాలి కథ గుర్తుకొచ్చింది. తండ్రెవరో తెలియని ఆ మునికుమారుడు తల్లిపేరు మీదే గుర్తించబడతాడు. తిరిగి ఆ కాలం వస్తేనే కానీ ఈ సమాజం బాగుపడదు కాబోలు. తను చాలా అతిగా ఆలోచిస్తుంది

అంటుంది జయ. కొంతమందికి జీవితమే ఆలోచన నేర్పుతుందేమో. నవోదయా కాన్వెంట్‌లో కూడా అదే అవమానాన్ని చవిచూసి వచ్చింది.

శెలవు కాన్సిల్ చేసుకుని ఆఫీసుకి వెళ్ళిపోదామా అనుకుంది. కానీ ఆఫీసువర్క్ చేసే మూడ్‌లేదు. అనాలోచితంగా టింకుని తీసుకుని జూకి బయల్దేరింది. టింకుకి జూ అంటే భలే ఇష్టం. తనుమాత్రం స్వేచ్ఛగా జీవించాలనుకునే మనిషి తనలాగే ప్రకృతిలో భాగమైన జంతువుల్నీ, పిట్టల్నీ పట్టుకుని బోనుల్లో బంధించి వినోదించడం ఎంత చిత్రం! ఇన్ని వేల రకాల ప్రాణుల్లోనూ స్వార్థం కేవలం మానవుడి ప్రత్యేకతే కాబోలు! తను ఏదైతే వాంఛిస్తాడో అది ఇతరులకి లభ్యం కాకూడదనుకుంటాడు. ఎంత విచిత్ర ప్రవృత్తి! తను గర్భిణిగా ఉన్నపుడు శేఖర్‌తో కలిసి మొదటిసారి ఈ జూకి వచ్చింది. అంత పెద్ద జూ అంతా తిరగలేక ఆయాసపడుతూంటే తనని ఎత్తుకు మోస్తానన్నాడు శేఖర్! అటువంటి శేఖర్ తనకు దొరకడం తన అదృష్టంగా భావించింది.

శేఖర్ తనని మొదటి చూపులోనే ప్రేమించి, తను కూడా కూడా తిరిగి తన తల్లిదండ్రుల్ని ఒప్పించి తనని పెళ్ళి చేసుకున్నాడు. తను సిటీబస్‌లో ఆఫీస్‌కి వెడుతోంటే తనని చూసి మనసు పారేసుకున్నాడట! ఎవరో రోడ్‌సైడ్ రోమియో అనుకుని మొదట అతన్ని తను లక్ష్యపెట్టలేదు. తనని రెండు నెలలు వెంబడించి తనతో మాట్లాడకుండానే తన తల్లిదండ్రుల్ని కలుసుకుని ప్రపోజ్ చేసాడు. కాళ్ళదగ్గరకు వచ్చిన సంబంధం కాబట్టి కట్నం తగ్గవచ్చనే ఆశతో తల్లి తనపై ఒత్తిడి తెచ్చింది. ప్రేమా గీమా అంటూ అటువంటి వలలో తనెపుడూ పడలేదు. పెళ్ళిమీద యిష్టతాలేదు-అయిష్టతాలేదు. కానీ తన బరువు దింపుకోవాలని తల్లిదండ్రులు చూస్తున్నారనే సంగతి తనకు బాగా తెలుసు.

తన ఇంటికి వచ్చిన శేఖర్‌తో తను స్పష్టంగానే చెప్పింది. తను నచ్చిన పక్షంలో కట్నకానుకలూ, ఆర్భాటాలూ ఏమీలేకుండానే వివాహం చేసుకోవాలనీ, తను ఉద్యోగం వదిలే ప్రసక్తి లేదని నిష్కర్షగా చెప్పింది. తన మాటలకి శేఖర్ మొదట కొంచెం హర్ట్ అయినట్టు కనిపించినా వెంటనే సర్దుకుని అంతా తన ఇష్టప్రకారమే చేస్తానన్నాడు. తనని ఎందుకు చేసుకోవాలనుకుంటున్నాడో కూడా అడిగింది. "మీరు నాకు అన్నివిధాలా నచ్చారు" అన్నాడు శేఖర్. "అన్ని విధాలా అంటే? మీరు నా రూపం మాత్రమే చూసారు. నా అభిరుచులు, ఆశయాలు, నా మనస్తత్వం ఇవేమీ తెలుసుకోనక్కరలేదా? అని అడిగింది తను.

"అవసరంలేదు. మీలాటి అందమైన మంచి అమ్మాయికి అన్నీ మంచి అలవాట్లే ఉంటాయని నా నమ్మకం". నవ్వుతూ అన్నాడు శేఖర్.

"నమ్మకాలు గ్రుడ్డివి కాకూడదు. నమ్మకాలకి ఆధారాలుండాలి. మనిషి రూపం మనిషి అంతరంగానికి చిహ్నం అనేమాటమీద నాకు నమ్మకంలేదు." తను రెట్టించింది.

"అయితే ఏం చెయ్యమంటారు? శేఖర్‌గొంతులో నీరసం ధ్వనించింది.



"నేను మీకు నచ్చావన్నారు. కానీ మీరు నాకు నచ్చిందీ లేనిదీ అడిగారా?" శేఖర్ తెల్లబోయాడు.


"నేను నచ్చావనీ కట్నంకూడా అక్కర్లేదనీ మీరు చెప్పగానే నేను ఎగిరి గంతేస్తానని ఎలా అనుకున్నారు? తను నవ్వుతూనే అడిగింది. శేఖర్‌కి చెమటలు పట్టడం చూసి తనకి జాలేసింది. ప్రక్కహాల్లోంచి తమ సంభాషణ వింటూన్న తన తల్లికి తను శేఖర్‌ని ప్రశ్నలతో ఇరకాటం పెట్టడం గంగవెర్రులెత్తించింది. "ఒసే నువ్వొకసారి టురా!" అని కేకేసింది. తను లేవలేదు.

"చూడండి శేఖర్! అంతరంగాలు తెలియకుండా కేవలం ముక్కు ముఖం చూసి పెళ్ళి చేసుకోవడం నాకిష్టంలేదు. నా రూపం మీకు నచ్చింది. నా అంతరంగం కూడా మీకు తెలవాలి. మనిద్దరి స్వభావాల్లో ఏకీకరణే ఎక్కువగా ఉంటే మిమ్మల్ని చేసుకోవడానికి నాకు అభ్యంతరం లేదు. అందుకోసం ఫ్రెండ్స్‌లా రోజూ కాసేపు కలుసుకుందాం ఇందుకు మీ కభ్యంతరమా?"

శేఖర్ జేబురుమాలుతో ముఖం తుడుచుకుంటూ 'లేదు' అన్నాడు. శేఖర్ వెళ్ళాకా తల్లి తనని ముక్కచివాట్లేసింది. కట్నం లేకుండా కాళ్ళ దగ్గర కొచ్చిన సంబంధాన్ని కాలదన్నుకోవడం అహంకారమంది, పొగరంది. తల్లిమీద తనకి కోపం రాలేదు. వాళ్ల ఆలోచనా పరిమితి తనకి తెలుసు. వాళ్ళతో ఘర్షణ అనవసరం అనుకుని జవాబివ్వలేదు.

శేఖర్ విషయం తన ఏకైక ప్రాణ స్నేహితురాలు జయతో చెబితే తల్లిలా తనని నిందించలేదు కాని సమర్థించలేదు. ఆడపిల్లల పెళ్ళిళ్ళవటం చాలాకష్టంగా ఉన్న ఈ రోజుల్లో కోరివచ్చిన వాడితో అంతఖరాకండిగా మాట్లాడటం మంచిది కాదేమో అంది- ఓ ప్రక్క తనభావాలు రైటని ఒప్పుకుంటూనే.

శేఖర్ తన ఇష్ట ప్రకారం తన ఇంటికే సాయంత్రం వచ్చేవాడు. ఇంటర్వ్యూకి వచ్చిన అభ్యర్థిలా మర్యాదగా ప్రవర్తించేవాడు. అతనితో కొన్నిసార్లు పార్కుకీ బజారుకీ కూడా వెళ్ళింది. ఇదంతా తల్లిదండులకి ముళ్ళమీద కూర్చునట్లున్నా తను ఖాతరు చెయ్యలేదు. శేఖర్ సభ్యతదాటి ఎపుడూ ప్రవర్తించలేదు. శేఖర్ తనని చాలా గాఢంగా వాంఛిస్తున్నాడని గుర్తించింది. అతన్ని కాదనేందుకు తగిన కారణాలేవీ తనకి కనిపించలేదు. పెళ్ళయిన తరువాత కూడా శేఖర్ తనని నెత్తిమీద




దేవతలాగే చూసుకున్నాడు- ఆ సంఘటన జరిగే దాకా.

శేఖర్‌కి హోటల్ తిండి పడదని తను నెలలు నిండేవరకు ఇంటికి వెళ్ళలేదు. తనని ఇంటి దగ్గర దిగబెట్టడానికి వచ్చినరోజు రాత్రి డాబామీద వెన్నెల్లో శేఖర్ గుండెలపై తల ఆన్చి పడుకుంది. జయ అన్నట్టు ఆడపిల్లల పెళ్ళిళ్ళు పెద్ద సమస్యగా మారిన ఈ రోజుల్లో శేఖర్ తనని కట్నంలేకుండా చేసుకోవడం, కాలు కిందపెట్టకుండా చూసుకోవడం- ఇది కలా నిజమా అనిపించింది. శేఖర్‌కి కొద్దినెలలు తను దూరంగా ఉండాలనే తలంపుతో బెంగపట్టుకుంది. శేఖర్‌ని తనెంతగా ప్రేమిస్తోందో తన అనుభవంలోకి వచ్చింది కూడా అప్పుడే. శేఖర్ తలలోకి వేళ్ళుపోనిచ్చి దువ్వుతూ అడిగింది.

"ఏ రకంగా చూసినా నేను చాలా సామాన్యమైన ఆడపిల్లని. నీకెందుకు అంతగా నచ్చాను శేఖర్? తా వలచింది రంభ, తాను మునిగింది గంగ అనే మాట నిజమా?"

శేఖర్ బుగ్గలు గిల్లుతూ అన్నాడు. "కావచ్చు. నా కళ్ళకి రంభలా కనిపించావు. సరేగానీ నాకో అనుమానం. అందకత్తెవి కాబట్టి నాకు మల్లెనే మరికొందరికి కూడా రంభలా కనిపించి ఉంటావ్. మరి ఎవరూ వాలా నీకూడా పడలేదా ఎప్పుడూ?"

శేఖర్ అలా అడిగితే అపుడు గుర్తొచ్చింది తనకి- తను బియెస్సీ ఆఖరి సంవత్సరం చివరలో ఉన్నప్పుడు ఎవరో అజ్ఞాత ప్రేమికుడు తనకు రాసిన ఉత్తరాల సంగతి. అంత అద్భుతమైన ప్రేమలేఖల్ని తనెపుడూ చదవలేదు. ప్రేమలేఖలు అలా ఉంటాయని కూడా తనకి తెలవదు. సంతకంగానీ చిరునామాగానీ లేకుండా వ్రాసిన ఆ ఉత్తర ప్రేమికుడెవరో తనకీ నాటికీ తెలియదు. తనకి ఉత్తరాలు రాసే వాళ్ళెవరూలేరు. 'నీకు ఉత్తరమే' అంటూ క్లాసులో ఎవరో తనకి కవరు అందిస్తే తనాశ్చర్యపోయింది. చదివిన తర్వాత అది తనకి కాదేమో అనుకుంది. కానీ తన పేరుగలవాళ్ళెవరూ ఇంకలేరు. ఉత్తరం చదువుతూంటే మొదట గాభరా అనిపించింది. ఎవర్నీ పట్టించుకోకుండా తలవంచుకుపోయే తన జోలికి సాధారణంగా ఎవరూ రారు. తనని తాను అందగత్తె అనుకోకపోయినా జయమాత్రం అంగీకరించదు.

నీ అందం నీకేం తెల్సు. ఆడపిల్లనైన నాకే నిన్ను కొరుక్కు తినాలనిపిస్తుంది అంటుంది. తన కళ్ళల్లో స్పార్క్ ఉందిట. నవ్వితే సొట్టలు పడే తన బుగ్గల్ని కొరకాలనిపిస్తుందట. స్నేహంలో లేని అందాలు కూడా కన్పిస్తాయేమో అనుకుంది తను. తన అజ్ఞాత ప్రేమికుడి ఉత్తరం జయ చూసి 'అతగాడెవరోకానీ గొప్ప సంస్కారవంతుడూ, సౌందర్యారాధకుడు, కవిలాగ ఉన్నాడే. చలం ప్రేమలేఖల స్థాయిలో ఉందే ఇది. అటువంటి వ్యక్తినుండి నువ్వు ప్రేమలేఖ అందుకోవడం గొప్పవిషయమే' అంది. "ఏం చెయ్యమంటావే దీన్ని?" అమాయకంగా అడిగింది తను.

"ప్రేమలేఖల్ని ఆడపిల్లలు దంతం పెట్టెలో పెట్టి అపురూపంగా దాచుకుంటారు" అంది జయ నవ్వి. అటువంటి ఉత్తరాలు తర్వాత మరి నాలుగువచ్చాయి. తనొక తక్కువ కులంలోని పేదయువకుడనీ, చదవు కొనసాగించడానికి అవకాశంలేక ఆర్టిస్టుగా బ్రతుకుతున్నాననీ చెప్పుకున్నాడు. తనని చూసాకా తన ఆర్ట్‌కి ఒక ఇన్‌స్పిరేషన్ దొరికిందనీ, తన వన్‌సైడెడ్ ప్రేమ ఫలించదని తెలిసినా, తన ఉత్తరాలవల్ల తన గురించి ఒకసారైనా ఆలోచిస్తావనీ అది తన జన్మకి చాలనీ, ఇంకేమేమో వ్రాసాడు.

అంత నిజాయితీగా సభ్యతతో హృద్యంగా కవితాత్మకంగా వ్రాసిన ఆ అందమైన అక్షరాలతో ఉన్న ఉత్తరాల్ని పారవెయ్యటానికి తనకి మనసొప్పలేదు. ఆ ఉత్తరాల్ని కవర్లో పెట్టి తన పెట్లో అడుగున పడే

సింది. తను కాలేజీ వదిలాకా మరెన్నడూ ఉత్తరాలు రాలేదు. ఆ ఆర్టిస్టే ప్రేమికుడు ఊరువదిలే వెళ్ళాడో లేక లోకాన్నే వదిలి వెళ్ళాడో తెలీదు. ఆ ఉత్తరాలు అప్పట్లో తనలో కొంత సంచలనం కలిగించిన మాట నిజం. తర్వాత గుర్తే లేదు- ఇపుడు శేఖర్ ప్రేమ ప్రసక్తి ఎత్తేవరకు.

ఆ ప్రేమ లేఖల సంగతి శేఖర్‌తో చెపుతోంటే చంద్రుణ్ణి కప్పేసిన నల్ల మబ్బుల మసక చీకటిలో శేఖర్ ముఖం పాలిపోవడం తనకు తెలియదు. "నిజంగా ఆ వ్యక్తిని నువ్వెన్నడూ చూడలేదా?" శేఖర్ గొంతు నీరసంగా ఉంది.

"ఊహూ... పేరే తెలియని మనిషెవరో ఎలా తెలుసుకోగలం?"

"ఆ వ్యక్తి ఎవరో తెలుసుకోవాలనీ, చూడాలనీ నీకనిపించలేదా?"

"ఎందుకనిపించదు? అతడెవరో తెలుసుకోవాలనిపించడం సహజమేగా."

"ఆ వ్యక్తి... ఆ వ్యక్తెవరో కనిపించి ఉంటే అతన్నే చేసుకునుండే దానివా? శేఖర్ గొంతు చాలా భారంగా ఉంది."

"ఆ సంగతి ఇప్పుడెలా చెప్పగలను. పెళ్ళికి ప్రేమ ఒకటే సరిపోదుగా."

"ఒకవేళ అతను ఎడ్రస్ ఇస్తే రిప్లై వ్రాసి ఉండేదానివా?"

"బహుశా వ్రాసి ఉండేదాన్నేమో. నిజాయితీగా అతను తన హృదయాన్ని నా ముందు విప్పినపుడు అంత నిజాయితీగానూ రిప్లై ఇస్తే తప్పేముంది. సరే గానీ శేఖర్, ఆ నల్ల మబ్బుని చీల్చుకొస్తున్న చంద్రుడు చూడు వెండిలా ఎలా మెరిసిపోతున్నాడో..."

శేఖర్ మాట్లాడలేదు. గుండెలమీద ఉన్న తన తలని దిండుమీదకి జరిపి అటు ప్రక్కకు తిరిగాడు. వెన్నల పిండారబోసినట్లుంది. చల్లగాలి తెరలు తెరలుగా వీస్తోంది. శేఖర్‌మీద చేయివేసి వీపుని హత్తుకుంది. అతని మెడమీద తన ఊపిరి వెచ్చగా తగుల్తోంది.

"శేఖర్! మన మధ్యకు వచ్చిన మూడో వ్యక్తి - ఈ కడుపులోని భడవ చూడు. నీకూ నాకు మధ్య ఎడం ఉండాలని నా పొట్టలో ఎలా తంతున్నాడో! అసలు నీకో సంగతి తెలుసా? మొదటిసారి నెల తప్పాకా పురుడొచ్చి బిడ్డతో మళ్ళీ అత్తింటికి వెళ్ళేవరకు అల్లుణ్ణి ఇలా అమ్మాయి దగ్గరకు రానివ్వ కూడదట. మా అమ్మ చెప్పింది. ఎందుకో తెలుసా శేఖర్?"...... శేఖర్ మాట్లాడకపోవటం చూసి బడలికవల్ల నిద్రలోకి జారుకున్నాడేమో అనుకుంది.

ప్రొద్దుటే శేఖర్ ప్రక్కనలేడు! తెల్లవారకట్లే వెళ్ళిపోయాడని తెలిసి తను ఆశ్చర్యపోయింది. ఉదయం లేస్తూనే తనని ముద్దుల్తో మేల్కొలిపే శేఖర్ తనని లేపకుండా, చెప్పకుండా వెళ్ళిపోవడం తనకి చాలా వెలితిగా అనిపించింది. టింకు పుట్టినట్టు టెలిగ్రాం ఇవ్వగానే రెక్కలు కట్టుకు వాలతాడనీ ముద్దులు మూటకట్టే కొడుకుని కన్నందుకు తనని ఆనందంతో మెరిసే కళ్ళతో చూసి తనని ముద్దుపెట్టుకుంటాడనుకుంది. కానీ వారం తర్వాత తన గుండెల్ని బ్రద్దలు చేస్తూ వచ్చింది శేఖర్ నుంచి ఉత్తరం.

"రూపా! నిన్ను మొదటిసారి చూడగానే నువ్వు నా కోసమే పుట్టావనీ, నేను వెదికే స్త్రీ నువ్వే అని అనిపించింది. నా భార్యను నేను ప్రేమించినంత గాఢంగా నన్ను నా భార్యకూడా అంతగాఢంగానూ నన్నే ప్రేమించాలనేది నా కోరిక. నా భార్య గుండెలనిండా నేనే ఉండాలనేది నా వాంఛ. ఇది నా స్వార్థమో బలహీనతో నే చెప్పలేను. కానీ... కానీ నా కంటె ముందుగా నిన్నెవరో గాఢంగా ప్రేమించారనీ, ఆ వ్యక్తి కనిపిస్తే నీ జీవితం అతనితో పెనవేసుకుని ఉండేదన్న ఊహ నన్ను పిచ్చివాణ్ణి చేస్తోంది. నీ మనసంతా నేనే నిండి ఉండాలనుకునే నా కోరికకి నీ ప్రేమలేఖల ఉదంతం తూట్లు పొడిచింది. ఆ ఉత్తరాలు ఇంకా నీ వద్దే అంతభద్రంగా ఉన్నాయంటే- అతను కనిపిస్తే నువ్వు తన్ని ఒదలి ఉండేదానివి కాదన్న నిజం నా గుండెని బ్రద్దలు చేసింది. నీతో మునుపటిలా ఎప్పటికీ ఉండలేనేమో....."

ఇంక ఉత్తరం తనకి చదవబుద్ధి కాలేదు. మనసు శూన్యమైందో, స్పందన కోల్పోయి బండబారిపోయిందో తనకే తెలియదు.

ఊళ్ళోనే ఉన్న జయ రోజులాగే తనని చూడటానికి వచ్చినపుడు శేఖర్ వ్రాసిన ఉత్తరాన్ని జయకందించింది. జయకి నోట మాట రాలేదు. నిన్ను ఏరికోరి చేసుకున్న శేఖర్ ఇంత మూర్ఖుడా! అసలా ఉత్తరాల ప్రసక్తి అతనికెందుకు చెప్పావ్? నేను వేళాకోళంగా వాటిని దాచుకొమ్మనడం నీ కొంప ముంచింది గదే. నన్ను క్షమించవే అని కంట తడి పెట్టింది. తన మనసు వికలమైనా నిబ్బరంగానే ఉంది. విచిత్రంగా తనకి శేఖర్‌మీద కోపమో అసహ్యమో కలగలేదు. మనసు బండబారితే ఉద్వేగాలు నశిస్తాయేమో.

"ఇపుడు ఏం చెయ్యదలచుకున్నావే? నేనే తెలివి తక్కువగా ఆ ఉత్తరాలు దాచమన్నాననీ, నీ తప్పేమీ లేదనీ నే వెళ్ళి శేఖర్‌కి నచ్చచెప్పనా?" ఆందోళనగా అడిగింది జయ.

తనే తేరుకుంది. "ఇందులో నీ తప్పు కానీ నా తప్పుకానీ ఏముంది? ఉత్తరాల సంగతి చెప్పడంవల్ల అతని సంస్కారమే బయట పడింది. నన్ను తన స్వంతం కావాలనుకోవడంలో ఇంతకాలం నన్ను తన కిష్టమైన వస్తువులాగో, పెంపుడు జంతువులాగో చూసాడని అర్థమైంది. నిజమైన ప్రేమ అన్‌కండిషనల్‌గా ఉండాలి. నాకూ ఒక వ్యక్తిగత జీవితం ఉంటుందని తెలుసుకోలేని వ్యక్తితో మూడేళ్ళు కాపురం చేసానా అనిపిస్తోంది."


"గాఢంగా ప్రేమించానన్న వ్యక్తి ఇంత సంకుచితంగా ఆలోచిస్తాడా?" జయ ఆశ్చర్యపోయింది.

"ప్రేమించడానికీ - సంకుచితంగా ఆలోచించడానికీ సంబంధంలేదే. ప్రేమ ఒక ఉద్వేగం. ఉద్వేగాలు ఎల్లకాలం ఒకేలా ఉండవు. సంకుచితత్వం ఆలోచనాలేమి ఫలితం. పురుషాధిక్య సమాజంలో, ఆ భావజాలపు శిక్షణలో పెరిగిన మొగవాడెవరైనా శేఖర్‌లాగే ప్రవర్తిస్తాడేమో. తనుపుట్టి పెరిగిన వర్గ సంస్కృతి ప్రభావానికి భిన్నంగా సాధారణంగా ఎవరూ ఆలోచించలేరు. ఎంగిలి మెతుకులకోసం దొంగ చూపులు చూసే కాకిలా తెల్లవారి లేస్తూనే కొత్తముఖాలకోసం మగాడు వేట ప్రారంభించ వచ్చు కానీ- భార్యగత ప్రేమాయణం గురించి ఏమైనా అనుమాన పడ్డాడా- ఇంక ఆ ఆడది కాపురానికి నీళ్ళొదిలేసుకోవలసిందే. ఇదేగా యుగయుగాల చరిత్ర. ఇదేగా మన మహత్తర పురాణాలు మన కంటించిన జబ్బు!"

"ఇంతకీ నీ సమస్యకి పరిష్కారం ఎలాగే? శేఖర్‌ని క్షమించి నచ్చచెప్పుకో లేవా?"

"ఒకరినొకరు క్షమాపణలు చెప్పుకునే ప్రసక్తేలేదు. నేను అక్కర్లేదనుకున్నా వ్యక్తి కోసం నేను ప్రాకులాడటం అసహ్యం కాదూ? నేనా పని చెయ్యలేను."

"అంటే... అంటే ఇంత చిన్న




విషయంకోసం కాపురానికి నీళ్ళొదులుకుంటావా? నీ తల్లిదండ్రుల్తో, నీ అన్నయ్యతో చెప్పిస్తే ప్రయోజనం ఉంటుందేమో?" జయెప్పుడూ ఇతర్ల సమస్యలకి కూడా స్వంత సమస్యల్లాగే బాధ పడిపోతుంది!

"చిన్న విషయమైనా, పెద్ద విషయమైనా మధ్యవర్తిత్వాల ద్వారా కాపురాలు చెయ్యాల్సిన పరిస్తితే వస్తే - ఆ కాపురం చెయ్యకపోవడమే ఉత్తమం. ఒళ్ళు దగ్గర పెట్టుకుని బుద్ధిగా కాపురం చేసుకోండి అని మరొకరి ద్వారా' చెప్పించుకోవలసి రావడం ఎంత జుగుప్సాకరం. నా కటువంటి పరిస్థితి వద్దే."

జయ తనవంక జాలిగా చూసింది. జయద్వారా విషయం తెలుసుకున్న తన వాళ్ళు తనదే తప్పని నిర్ధారించారు! పోయి శేఖర్‌ని బ్రతిమాలుకుని కాపురం నిలబెట్టుకోమన్నారు!

"నేను చేసిన తప్పేమిటి, నేరమేమిటి అతనికాళ్ళు పట్టుకోడానికి? నేను భారమనుకుంటే చెప్పండి నా దారి నేను చూసుకుంటాను" అంది. తల్లికికోపం వచ్చి మాట్లాడటం మానేసింది. టింకువైపు కనీసం కన్నెత్తయినా ఎవరూ చూడలేదు!

యాంత్రికంగా, ఆఫీసుకి వెళ్ళివస్తోంది. జయ తన మనసు మార్చడానికి ఎన్నోసార్లు ప్రయత్నించింది. "తెగేదాకా తాడు లాగకూడదే. బయట వల్లురిలోనూ విదూషకుడిలా ఎంతో నవ్విస్తూ సరదాగా ఉండే నా మొగుడు ఇంట్లో అడుగుపెట్టగానే ఎంత సీరియస్‌గా ఉంటాడో, ఎలా అరుస్తాడో నీకేం తెలుసే? సర్దుకు పోకపోతే నా గతేమిటి? ఆడపుటక పుట్టాకా మనమే కొంచెం వెనక్కి తగ్గాలే. నువ్విలా భీష్మించుకు కూర్చుంటే నీ సమస్యకి పరిష్కారం ఏమిటే?" అంటూ జయ తనని ప్రాధేయపడింది. తన కన్నతల్లి ఎప్పుడూ తల్లిలా ప్రవర్తించకపోవడమూ, ఏ రక్త సంబంధం లేని జయ తనకోసం కంటతడిపెట్టడం తనని విస్మయపరచింది.

"కలిసి జీవించడం ఇష్టంలేనప్పుడూ, అసాధ్యం అనుకున్నపుడూ విడిగా జీవించడమే పరిష్కారమే. మనసులు కుళ్ళబెట్టుకుని శరీరాలతో సంసారాలు చెయ్యడం నా దృష్టిలో జుగుప్సకు పరాకాష్ట. ఇంకెపుడూ నా కాపురం సంగతి ఎత్తకు." అంది తను. జయ ముఖం చిన్నపుచ్చుకుంది.

టింకుకి ఆరునెలలు నిండాకా ఓ అర్ధరాత్రి హఠాత్తుగా ఊడిపడ్డాడు శేఖర్. అతని రాక ఇంట్లో అందరినీ ఆశ్చర్యంతో బాటు ఆనందపరచింది- తనని తప్ప. తను మొదట శేఖర్‌ని గుర్తుపట్టలేదు. పుష్టిగా చక్కగా ఉండేమనిషి చిక్కి సన్నబడి ఒత్తుగా పెరిగిన గెడ్డంతో నలిగి మాసిన దుస్తులతో బికారిలా ఉన్నాడు. ఏమి జరగనట్లే అతనికి అల్లుడు మర్యాదలు జరిగాయి. శేఖర్ ఆ మర్యాదల్నేమీ పట్టించుకోకుండా తన జబ్బ పట్టుకుని "ఇంటికి పద, బయట టాక్సీరెడీగా ఉంది" అన్నాడు. తనతల్లి టింకుని నిద్రలేపి శేఖర్‌కి చూపించడానికి తనగదిలోకి వెళ్ళబోతోంటే తనువారించింది.

"సారీ, మీతో రావడానికీ కాపురం చెయ్యడానికీ నేను సిద్ధంగాలేను. మీ ఇష్టం లేనపుడు దూరంగా ఉండి, మీ కోపతాపాలు తగ్గాకా దగ్గరకు రావడానికి నేనేమీ మీ పెట్ డాగ్‌ని కాదు. ఏమీలేనిదానికి ఇంత జరిగాకా ఏమీ జరగనట్లే నేను ఆత్మవంచన చేసుకుని మీతో కాపురం చేయుటం జరగని పని. పూర్వ ప్రేమాయణాలు ఏమీలేని మరో స్త్రీ నెవరినైనా మీరు వివాహం చేసుకోదలిస్తే నిరభ్యంతరంగా చేసుకోవచ్చు. టింకూ నా దగ్గరే ఉంటాడు." స్థిరంగా మెల్లిగానే చెప్పినా బాంబు బ్రద్దలవనే అయింది. శేఖర్ తన జబ్బ వదిలేసి ఒక్కక్షణం తనవంక ఒక వెర్రిచూపు చూసి ఛటుక్కున వెనుదిరిగి చీకట్లో మాయమయ్యాడు. అదే తను చివరసారిగా శేఖర్‌ని చూడటం. మర్నాడు తల్లిదండ్రులు, అన్నా వదినెలు తనమీద యుద్ధం ప్రకటించారు. తను మారు మాట్లాడకుండా ఒకచేత టింకూని మరోచేత తనపెట్టె పట్టుకుని ఇంట్లోంచి బయట పడింది. ఆ తరువాత మరెన్నడూ ఇంటిముఖం చూడలేదు. ఆమలులో ఉన్న సామాజిక కట్టుబాట్లనీ విలువల్నీ ప్రశ్నిస్తే అయినవాళ్ళు కూడా ఎలా నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తారో తను చవి చూసింది. తనని వదలలేక జయమాత్రం వచ్చి చూసిపోతూనే ఉంది.

"ఏమే, నేనొకటి అడుగుతాను. కోపం తెచ్చుకోకు. భార్యాభర్తలన్నాకా ఎవరికైనా ఎప్పుడైనా మనస్పర్థలు రాకుండా ఉంటాయా? స్పర్థలొచ్చాయని ఆడవాళ్ళందరూ నీలాగే విడిపోవాలని నిర్ణయించుకుంటే లోకం ఏమవుతుందే?" స్కూలు పిల్లలు టీచర్‌ని అడిగిట్లు అడిగింది జయ చేతులు కట్టుకుని.

తను నవ్వింది. "నిజమే. స్పర్థలు రాకుండా ఉండవు. పెర్‌ఫెక్ట్ మనుషులంటూ ప్రపంచంలో ఎవరూ ఉండరు. మొగుళ్ళతో స్పర్థలొచ్చినంత మాత్రాన ఆడవాళ్ళందరూ నాకుమల్లె విడిపోరు. దానికి చాలా కారణాలున్నాయి. మగవాళ్ళతోబాటు ఆడవాళ్ళుకూడా పురుషాధిక్య సమాజపు విలువల్నీ, నీతి నియమాలనీ పుట్టినుండీ పుణికి పుచ్చుకుంటారు కాబట్టి తమ అణిచివేతనూ, అవమానాలను చాల సహజంగానూ తేలిగ్గాను భావిస్తారు. తిరగబడటం అనే ఆలోచనేరాదు. వచ్చినా ఎలా తిరగబడి స్వతంత్రంగా బ్రతకాలో తెలియదు. ఇదంతా ఎందుకొచ్చిన తలనెప్పి? పెడితే తిని కొడితే పడిఉంటే పోలా అనే చాలామంది స్త్రీలు భావిస్తారు. తిరుగుబాటెపుడూ గాల్లోంచి పుట్టదు. అవమానాల్లోంచి, అణిచివేతలోంచి, ఆలోచనల్లోంచి, విశ్లేషణలోంచి, తెగింపులోంచి పుడుతుంది 'తిరుగుబాటు. అందుచేత నాలాటి చెదరుమదురు తిరుగుబాటుదార్ల వల్ల లోకం తలక్రిందులైపోతుందని బెంగపెట్టుకోకు. పురుషాధిక్యతా మూలస్థంభాలని గట్టిగా కాపాడే నాలాటి ఆడవాళ్ళున్నంత కాలం ఈ సమాజం చెక్కుచెదరదే."

జయకూడా నవ్వింది. "నువ్వు చెప్పేదంతా నిజమే అనిపిస్తుంది. కానీ నీ

పద్ధతుల్ని అమల్లో పెటాలంటేనే నాకు వణకూ దడా వస్తాయి" అంది.

ఏ చిన్న ఉద్యోగమైనా చేస్తే ఇంట్లో ఏ ఖర్చుకైనా వస్తాయని జయకి ఉద్యోగం చెయ్యాలని ఆశ. ఆడది బయటకొస్తే విచ్చలవిడితనం అలవాటవుతుందని వాదించే జయభర్త రామారావు జయకోరికను మొగ్గలోనే త్రుంచివేసాడు. అందుకే తను ఆఫీస్‌కి వెడుతూ టింకుని జయదగ్గర ఉంచి వెడుతుంది. జయ తన పిల్లలకన్నా ఎక్కువగానే టింకుని చూస్తుంది. టింకు స్కూల్ ఎడ్మిషన్ ఇంత తలనెప్పి వ్యవహారం అవుతుందని తను అనుకోలేదు.

టింకుతో జూ అంతా తిరిగి ఇంటికి బయల్దేరింది. మర్నాడు లంచ్ అవర్‌లో జయ ఫోన్ చేసి చెప్పింది. తన స్నేహితురాలికి తెలిసున్న వాళ్ళ కాన్వెంట్‌లో టింకుని తనిష్ట ప్రకారమే చేర్పించవచ్చనీ కాకపోతే ఫీజెక్కువనీ చెప్పింది. తన సమస్యను పరిష్కరించగలిగాననే ఆనందం జయ గొంతులో ధ్వనించింది.

సాయంత్రం జయ ఇంటికి చేరుకోగానే జయ కాఫీ అందిస్తూ "నీ సమస్యని పరిష్కరించినందుకు నాకేమిటి బహుమతి ఇస్తావే? అంది.

నా సమస్యకి నిన్నరాత్రే నాకు పరిష్కారం దొరికిందే. అయినా నీకు బహుమతి ఇస్తాన్లే" అంది రూప కాఫీ సిప్ చేస్తూ.

"మొత్తానికి నువ్వే సాధించావన్న మాట! ఇంతకీ ఏ కాన్వెంట్? ఎక్కడ? ఎన్ని వేలు కట్టాలి? జయ ప్రశ్నల వర్షం కురిపించింది."

"నా ఇల్లే నా కాన్వెంట్. నేనే హెడ్మిస్ట్రెస్‌ని. నా కొడుకుని నా పేరుమీదే నా కాన్వెంట్‌లో చేర్చుకుంటాను."

జయతెల్లబోయింది. "సస్పెన్స్ చంపక చెప్పవే."

రూప స్థిరంగా అంది- "రాత్రంతా సీరియస్‌గా ఆలోచించావే. జన్మనిచ్చిన తల్లిబతికి ఉండగా ఏ సంబంధంలేని తండ్రిపేరే వ్రాయాలని శాశించే ఈ విద్యాలయాలకి నా కొడుక్కి చదువు చెప్పే అర్హత లేదే....."

"అందుకని టింకుని అసలు స్కూల్లోనే చేర్పించవా?" జయ నుదురు చిట్లించింది.

"అవునే, వాణ్ణి ఏ స్కూల్లోనూ చేర్పించ దలచుకోలేదు. ఈ వారం రోజుల్లోనూ నేనొక గుణపాఠం నేర్చుకున్నానే. కుష్టు రోగం కన్నా అసహ్యమైన ఈ పురుషాధిక్య సమాజాన్ని చెక్కుచెదర కుండా నిలబెడుతున్నది ఈ విద్యావ్యవస్థే. ఇతర చట్టాల్లాగే ఈ విద్యాచట్టాలనీ, నీతిమాలిన పాఠాలనీ రూపొందించేది పురుషులేగా. పురుషులు చేసే చట్టాలు ఎపుడూ పురుషులకే అనుకూలంగానూ స్త్రీలకు వ్యతిరేకంగానూ, అవమానించేవిగానూ ఉంటాయి. ఆ చట్టం చేసే పురుషుడు గాంధీ అయినా సరే నెహ్రూ అయినా సరే. లేకపోతే రోజు రోజుకీ స్త్రీలపై దౌర్జన్యం, అణచివేత ఈ దేశంలో ఎలా ఎక్కువ అవుతున్నాయి?

భార్యబిడ్డల్ని మగమహారాజు నిర్దాక్షిణ్యంగా వదిలేసి వెళ్ళిపోయినా ఆ కొడుకు తండ్రిపేరు మీదుగానే గుర్తించబడాలని శాసించే ఈ చట్టాల, న్యాయవ్యవస్థల హీనత్వం, దౌష్ట్యం నగ్నంగా కళ్ళకి కనపడటం లేదా? పసిపిల్లల లేత మెదళ్ళలో తల్లిదండ్రుల్లో తండ్రిని ఎక్కువగాను తల్లిని ఎస్మరింపబడేదిగాను నేర్పే, ముద్రించే ఈ విద్యావ్యవస్థ సమూలంగా నాశనం కావాలి. పిల్లలు తల్లిదండ్రులిద్దరి పేరుమీదా లేక ఎవరి సంరక్షణలో ఉంటే వారి పేరు మీద గుర్తించబడాలి. సమ సమాజ ఆవిష్కరణకి అది తొలిమెట్టు కావాలి.

అందుకే స్త్రీ పురుషులపట్ల ద్వంద విలువల్ని పాటిస్తూ వాటినే పిల్లలకు నేర్పే ఈ పాఠశాలల్లో టింకూని చేర్పించి వాడు మరో శేఖర్ అవడానికి అవకాశం ఇవ్వదల చుకోలేదు. కన్నతల్లిని, చదువుకున్నదాన్ని ఆమాత్రం విద్యాబుద్ధులు నేచెప్పలేకపోను. నా దగ్గరేఉండి చదువు కుంటాడు. వాడి సమస్యకు పరిష్కారం కోసం మూర్ఖంగా బయటవెదికాను. కానీ ఎవరి సమస్యకు పరిష్కారం వాళ్ళ దగ్గరే ఉంటుందని తెలుసుకున్నాను.

టింకునీ, నన్ను కన్నతల్లికన్నా ఎక్కువగానే చూసిన నీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనే. నువు నా స్నేహితురాలవు మాత్రమే కాదు, నాకు తల్లివికాని తల్లివి! పొగిడితే తిడతావు. వస్తానే మరి."

టింకు చెయ్యిపట్టుకుని బయల్దేరిన రూపని గుమ్మందగ్గరే నిలబడి అలా చూస్తూ ఉండిపోయింది జయ. తడిదేరిన జయ కళ్ళకి నడుస్తూ వెడుతూన్న రూప అనేక రూపాలుగా ప్రతిబింబించి ఒక్కసారిగా అవి ఒకే ఒక్క రూపగా ప్రతిఫలించి సాగిపోతూ కనిపించింది. ●

# తస్లీమా నస్రీన్ తృష్ణ

తెలుగు సేత : జొన్నలగడ్డ హసీనా

(గులాబీల పరిమళపు మడుగులో మునిగి వుల్లాసంగా ఆడుకుందాం చేపల్లా)



ఆ అమూల్యమైన నిక్షేపాన్ని తాకాలని
మరీ మరీ కోరిగ్గా వుంది.
నువ్వు,
ఎడతెరిపి లేకుండా ఉరుముతూ మెరుస్తూ
కుండపోతగా కురుస్తోంటే,
యెంతకాలంగానో యెండి బీటలువారిన
నా వొంటిని,
దిగంబరంగా పరిచి, నిన్ను ప్రతి చుక్కా తాగెయ్యాలనుంది!
నీ చలిపెదవుల్ని నా వెచ్చని నోటితో
వదలనుగాక వదలను.
నాకు సామ్రాజ్యాలొద్దు. రాజమందిరాలొద్దు.
మోకాళ్ల మీద నిలిచి
నీ కోసం నీ జాడకోసం
నీ అలికిడి కోసం నీ అడుగుల కోసం
**ఆకాశం కేసి తలెత్తి**
బతుకంతా యెదురు చూస్తూ వుంటాను.
చేతులు చాచు. నన్ను లాక్కో.
మెత్తని చలియెండలాంటి నన్ను కప్పుకో!
ముంచెత్తే వెల్లువలా
నామీద విరుచుకుపడు!
అనుభవం లేని నా వొంటిమీద
నెత్తుటి మరక చెయ్యి.
ఈ ఉద్విగ్న యౌవనాన్ని భరించలేను.
నాకు నువుకావాలి.
ఇల్లొద్దు. లోకం వొద్దు. నువ్వేకావాలి.
నువ్వే నువ్వే, కావాలి!